



EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
శనివారం
17-01-2026
పేజీలు: 02



# ప్రపంచ దేశాలకు ట్రంప్ మరో వార్నింగ్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ప్రపంచ దేశాలకు మరోసారి టారిఫ్ ల హెచ్చరికలు చేశారు. గ్రీన్ లాండ్ ను ఎలాగైనా తీసేసుకుంటామని ఇప్పటికే స్పష్టం చేసిన ట్రంప్.. ఈ విషయంలో తమతో విభేదించే దేశాలకు టారిఫ్ లతో బదులిస్తామని వార్నింగ్ ఇచ్చారు. అమెరికా జాతీయ భద్రత విషయంలో గ్రీన్ లాండ్ చాలా కీలకమని, అయితే సులువుగా, కాకపోతే కఠిన పద్ధతిలోనైనా దానిని స్వాధీనం చేసుకోవడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఈ ఆక్రమణను వ్యతిరేకిస్తే సహించబోనని చెప్పారు. ప్రపంచ దేశాలను ఉద్దేశించి ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసినప్పటికీ పరోక్షంగా డెన్మార్క్ ను నేరుగా హెచ్చరించినట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. గ్రీన్ లాండ్ ను అమెరికా ఆక్రమించుకోవాలని చూడడాన్ని డెన్మార్క్ మొదటినుంచీ వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. తమ అధీనంలోని గ్రీన్ లాండ్ ఎన్నటికీ స్వతంత్రంగానే ఉంటుందని డెన్మార్క్ అధ్యక్షుడు మెట్టె ఫ్రెడెరిక్సన్ పలుమార్లు తేల్చిచెప్పారు. కాగా, ప్రస్తుతం అమెరికా, డెన్మార్క్ ల మధ్య అమలులో ఉన్న ఒప్పందాల ప్రకారం.. అమెరికా ఎప్పుడంటే అప్పుడు, ఎంతమంది బలగాలనైనా సరే గ్రీన్ లాండ్ కు తరలించవచ్చు. అమెరికా భద్రత కోసం గతంలో చేసుకున్న ఒప్పందాలలో ఈ నిబంధన ఉంది. అయితే, ట్రంప్ మాత్రం గ్రీన్ లాండ్ ను పూర్తిగా అమెరికా పరం చేయాలని పట్టుబడుతున్నారు. ఈ విషయంలో గ్రీన్ లాండ్ తో సహా ఏ దేశం అడ్డొచ్చినా ఆగేదిలేదని ట్రంప్ స్పష్టం చేశారు.



### ఆమిర్ ఖాన్ కుమారుడితో సాయిపల్లవి..

## 'ఏక్ దిన్' టీజర్ విడుదల

ఆమిర్ ఖాన్ తనయుడు జునైద్ ఖాన్ హీరోగా, స్టార్ హీరోయిన్ సాయి పల్లవి కథానాయికగా నటిస్తున్న బాలీవుడ్ చిత్రం 'ఏక్ దిన్' (Ek Din). సునీల్ పాండే దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఆమిర్ ఖాన్ స్వయంగా నిర్మిస్తున్నారు. రామ్ సంపత్ సంగీతాన్ని సమకూర్చిన ఈ చిత్రం వేసవి కానుకగా మే 1, 2026న థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా టీజర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. కొన్ని ప్రేమకథలకు కాలంతో పనిలేదు అనే ఆసక్తికరమైన క్యాప్షన్‌తో వచ్చిన ఈ టీజర్ ఫీల్ గుడ్ లవ్ స్టోరీని తలపిస్తోంది. జపాన్‌లోని సపోరో వంటి అందమైన మంచు ప్రదేశాలలో చిత్రీకరించిన ఈ విజువల్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. 2016 నాటి థాయ్ సినిమా 'వన్ డే'కి అధికారిక రీమేక్‌గా వస్తున్న ఈ చిత్రంలో సాయి పల్లవి 'మీరా' అనే పాత్రలో కనిపిస్తుండగా, ఆమె ప్రేమను గెలుచుకోవడానికి ప్రయత్నించే యువకుడిగా జునైద్ ఖాన్ తన నటనతో మెప్పించబోతున్నాడు. ప్రస్తుతం సాయి పల్లవి ఈ సినిమాతో పాటు నితేష్ తివారీ దర్శకత్వంలో వస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'రామాయణం'లో సీత పాత్రలో కూడా నటిస్తూ బిజీగా ఉన్నారు.



### మహాకాలేశ్వరుడిని దర్శించుకున్న

## కోహ్లీ, కుల్దీప్

టీమిండియా క్రికెటర్లు కొందరు ఇవాళ ఉజ్జయిని మహాకాలేశ్వరుడి సేవలో పాల్గొన్నారు. బోలేనాథుడికి నిర్వహించే భస్మ హారతిలో పాల్గొన్నారు. మేటి బ్యాటర్ విరాట్ కోహ్లీ, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌తో పాటు మరికొంత మంది క్రికెటర్లు మహాశివుడి దర్శనం చేసుకున్నారు. టీమిండియా ఫీల్డింగ్ కోచ్ టీ దిలీప్ కూడా ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ ఆడుతున్న కోహ్లీ.. ఇండోర్‌లో ఆదివారం జరగనున్న మూడవ వన్డే కోసం రెఢీ అయ్యాడు. అయితే ఇవాళ ఉదయం 4 గంటలకు కొందరు క్రికెటర్లు మహాకాలేశ్వరుడి సన్నిధానికి విచ్చేశారు. నంది హాల్‌లో కూర్చున్న క్రికెటర్లకు పూజారులు తిలకం దిద్దారు. సుమారు రెండు గంటలకు పైగా కోహ్లీ, కుల్దీప్ భస్మ హారతిలో పాల్గొన్నారు. ఆ క్రికెటర్లకు నుదుటిపై పూజారుల గంధం పూశారు.

# ఆర్‌సీబీ హ్యాట్రిక్

మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) వరుస విజయాల పరంపర కొనసాగుతున్నది. లీగ్‌లో శుక్రవారం జరిగిన పోరులో ఆర్‌సీబీ 32 పరుగుల తేడాతో గుజరాత్ జెయింట్స్‌పై అద్భుత విజయం సాధించింది. తద్వారా ఆడిన మూడు మ్యాచ్‌ల్లో విజయాలతో హ్యాట్రిక్ ఖాతాలో వేసుకుని టాప్‌గేర్‌లో దూసుకెళుతున్నది. ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తుచేస్తున్న ఆర్‌సీబీ మరోమారు సమష్టి ప్రదర్శనతో సత్తాచాటింది. మరోవైపు ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో రెండింటిలో ఓడి, రెండు గెలిచిన గుజరాత్ నాలుగు పాయింట్లతో మూడో స్థానంలోఉంది. ఆర్‌సీబీ నిర్దేశించిన 183 పరుగుల లక్ష్యఛేదనలో గుజరాత్...యువ స్పిన్నర్ శ్రేయాంక పాటిల్(5/23) ధాటికి 18.5 ఓవర్లలో 150 పరుగులకు ఆలౌటైంది. టాపార్డర్‌ను ఇయాన్ బెల్(3/29) పనిపడితే, మిగతా పనిని పాటిల్ పూర్తి చేసింది. వీరిద్దరి విజృంభణతో గుజరాత్ జట్టులో భారతి(39) మినహా అందరూ ఘోరంగా విఫలమయ్యారు. సోఫీ డివైన్(8), కెప్టెన్ ఆశ్లే గార్డ్‌నర్(3) స్థాయికి తగ్గ ఆటతీరు కనబర్చలేకపోయారు. ఆర్‌సీబీ కట్టుదిట్టమైన బౌలింగ్ దాడికి గుజరాత్ వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయి మూల్యం చెల్లించుకుంది. క్రీజులో భారతి ఉన్నంతసేపు జెయింట్స్ గెలుపుపై ఆశలు చెలరేగినా..సరైన సహకారం కరువైంది. పిచ్ పరిస్థితులను సద్వినియోగం చేసుకుంటూ పాటిల్ స్పిన్




తంత్రంతో గుజరాత్ ఇన్నింగ్స్‌ను కకావికలు చేసింది. వైవిధ్యమైన స్పిన్‌తో శ్రేయాంక వికెట్ల వేట కొనసాగించింది. తొలుత రాధాయాదవ్(66) అర్ధసెంచరీకి తోడు రిచా ఘోష్(44) రాణించడంతో ఆర్‌సీబీ 20 ఓవర్లలో 182/7 స్కోరు చేసింది. టాపార్డర్ విఫలమైనా రాధా యాదవ్ సాధికారిక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకుంది. సోఫీ డివైన్(3/31) మూడు వికెట్లు తీసింది. రాధా యాదవ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.



## టీ20ల్లోకి అయ్యర్

స్వదేశంలో వచ్చే నెలలో జరుగనున్న టీ20 ప్రపంచకప్ సన్నాహక సిరీస్‌కు భారత స్క్వాడ్‌లో కీలక మార్పులు చేశారు సెలెక్టర్లు. తిలక్ వర్మ, ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ గాయపడిన నేపథ్యంలో వీరి స్థానాన్ని మరో ఇద్దరితో భర్తీ చేశారు. న్యూజిలాండ్‌తో పొట్టి సిరీస్ కోసం శ్రేయాస్ అయ్యర్, మిస్టరీ స్పిన్నర్ రవి బిష్ణోయ్‌లను తీసుకున్నారు. దాంతో.. వన్డేలకే పరిమితమైన అయ్యర్ మళ్లీ టీ20ల్లో దంచేసేందుకు సిద్ధమవుతున్నాడు. డిఫెండింగ్ ఛాంపియన్ భారత జట్టు ఈసారి ఫేవరెట్‌గా ప్రపంచకప్ బరిలోకి దిగుతోంది. అంతకంటే మందుగా జనవరి 21 నుంచి న్యూజిలాండ్‌తో ఐదు మ్యాచ్‌ల పొట్టి సిరీస్ ఆడనుంది.



## లక్ష్యసేన్ ఔట్

ఇండియా ఓపెన్‌లో భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్ పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో లక్ష్యసేన్ 21-17, 13-21, 18-21తో లిన్ చున్ యి(చైనీస్ తైపీ) చేతిలో పోరాడి ఓడాడు. 68 నిమిషాల పాటు సాగిన పోరులో తొలి గేమ్‌ను 21-17తో కైవసం చేసుకున్న లక్ష్యసేన్.. ఆ తర్వాత మ్యాచ్‌పై పట్టు కోల్పోయాడు. పోరును దూకుడుగా ఆరంభించిన లక్ష్యసేన్..చైనీస్ తైపీ షట్లరకు దీటైన పోటీనిచ్చేందుకు ప్రయత్నించాడు. మెరుగైన ఆధిక్యంతో తొలి గేమ్‌ను ఖాతాలో వేసుకున్న ఈ యువ షట్లర్ చున్ యి నుంచి అనూహ్య పోటీ ఎదురైంది. వరుసగా నాలుగో ఓటమి చవిచూసిన లక్ష్యసేన్ స్థాయికి తగ్గ ఆటతీరు కనబర్చలేకపోయాడు. సేన్‌ను మరింత ఒత్తిడిలోకి నెడుతూ పదునైన స్మాష్‌లు, నెట్‌గేమ్‌తో చున్ యి రెండో గేమ్‌ను 21-13తో దక్కించుకున్నాడు. నిర్ణయాత్మక మూడో గేమ్‌లోనూ ఎక్కడా వెనుకకు తగ్గని చున్‌యికి లక్ష్యసేన్ పోటీనిచ్చే ప్రయత్నం చేసినా లాభం లేకపోయింది.

## సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించిన అనసూయ



సోషల్ మీడియాలో తన గౌరవానికి భంగం కలిగించేలా అభ్యంతరకర పోస్టులు, వీడియోలతో వేధింపులకు గురిచేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రముఖ నటి, యాంకర్ అనసూయ భరద్వాజ్ సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించారు. తన ఫొటోలను మార్ఫింగ్ చేయడం, అసభ్యకరమైన వీడియోలు తయారు చేయడం, వృత్తి మరియు వ్యక్తిగత జీవితాన్ని లక్ష్యంగా చేసుకుని కించపరిచే కంటెంట్‌ను కొందరు ఉద్దేశపూర్వకంగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ తరహా చర్యల వల్ల తాను తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నానని, తన పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అనసూయ ఫిర్యాదులో కోరారు. మహిళగా, ప్రజా జీవితం ఉన్న వ్యక్తిగా తనపై జరుగుతున్న ఈ దాడులు సహించదగ్గవి కాదని, ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో ఇతరులకూ పునరావృతం కాకుండా కఠిన చర్యలు అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు. అనసూయ ఫిర్యాదు మేరకు సైబర్ క్రైం పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ వ్యవహారంలో మదర్ రూరల్ ఎడ్యుకేషన్ సొసైటీ డైరెక్టర్ బొజ్జా సంధ్యారెడ్డి, సోషల్ మీడియా ఇన్ఫ్లూయన్సర్లు ప్రియా చౌదరి, గోగి నేని సహా మొత్తం 42 మందిపై ఐటీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. సోషల్ మీడియా వేదికగా అనసూయను లక్ష్యంగా చేసుకుని అభ్యంతరకర కంటెంట్‌ను సృష్టించడం, ప్రచారం చేయడంలో వీరి పాత్ర ఉందని ప్రాథమిక విచారణలో తేలినట్లు సమాచారం.

### రొమాన్స్‌కు నో చెప్తే

## ఒత్తిడి చేశారు

నటి తమన్నా తన కెరీర్ తొలినాళ్లలో ఎదుర్కొన్న ఇబ్బందులను ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. సీనియర్ స్టార్లతో రొమాంటిక్ సన్నివేశాల్లో నటించమని దర్శకుడు కోరినప్పుడు, ఆమె అసౌకర్యంగా భావించి తిరస్కరించారు. అప్పుడు దర్శకుడు ఆమెను మార్చేస్తానని బెదిరించి ఒత్తిడి తెచ్చారని, కానీ తమన్నా తన నిర్ణయానికి కట్టుబడి ఉన్నారని తెలిపారు. చివరికి దర్శకుడే క్షమాపణలు చెప్పారని, సినీ పరిశ్రమలో సురక్షితమైన వాతావరణం ఉండాలని ఆమె అభిప్రాయపడ్డారు.





## 1,116 రకాల వంటకాలతో కొత్త అల్లుడికి పసందైన విందు

కొత్త అల్లుడికి పసందైన విందు పెట్టారు అత్తారింటివారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం కైకరానికి చెందిన అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు కోనా హనుమాన్ బాబు—కళ్యాణి దంపతుల కుమార్తె శ్రీజ వివాహం పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంకు చెందిన నారాయణం సంజయ్‌తో ఇటీవల జరిగింది. వివాహం అనంతరం తొలి సంక్రాంతికి అత్తారింటికి వచ్చిన అల్లుడిని ఘనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొత్త అల్లుడికి ఏకంగా 1,116 రకాల వంటకాలతో సంప్రదాయబద్ధమైన విందు ఏర్పాటు చేసి అందరి దృష్టిని ఆకర్షించారు.

## ఏపీ లిక్కర్ స్కాం కేసులో విజయసాయి రెడ్డికి ఈడీ నోటీసులు



ఏపీ లిక్కర్ స్కాం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ ఎంపీ విజయసాయి రెడ్డికి ఈడీ నోటీసులు జారీ చేసింది. ఈ నెల 22వ తేదీన ఢిల్లీ లేదా హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని సూచించింది. వైసీపీ హయాంలో 2019 నుంచి 2024 మధ్య ఏపీలో అమలు చేసిన మద్యం పాలసీతో భారీ అక్రమాలు జరిగాయని కూటమి ప్రభుత్వం ఆరోపించింది. ఈ నేపథ్యంలోనే లిక్కర్ స్కాంమ్‌కు సంబంధించి ఈడీ విస్తృతంగా దర్యాప్తు చేపడుతోంది. ఈ క్రమంలో ఈ కేసులో పలువురు వైసీపీ నాయకులు, అధికారుల పేర్లు వెలుగులోకి వచ్చాయి. తాజాగా ఇందులో విజయసాయి రెడ్డి పేరు కూడా బయటకు వచ్చింది. మద్యం సరఫరాదారులు, డిస్టలరీల నుంచి భారీ ఎత్తున ముడుపులు స్వీకరించి, ఆ నగదును హవాలా రూపంలో బదిలీ చేసినట్లుగా ఆరోపణలు వచ్చాయి. దీంతో మనీలాండరింగ్ కింద విజయసాయి రెడ్డికి ఈడీ నోటీసులు జారీ చేసింది.



## రెండు వారాల్లో మిగతా ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోవాలి: సుప్రీంకోర్టు

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపు అంశంపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. 'స్పీకర్ కు ఇదే చివరి అవకాశం. ఇప్పటికే తగిన సమయం ఇచ్చాం. నిర్ణయం తీసుకోకుంటే కీలక పరిణామాలు ఉంటాయి. మిగిలిన ముగ్గురు ఎమ్మెల్యేలపై రెండు వారాల్లో నిర్ణయం తీసుకోండి' అని చెప్పింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. కాగా స్పీకర్ మరో ముగ్గురు ఎమ్మెల్యేపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.



## ఫ్యాటీ లివర్ డిసీజ్ లక్షణాలు, కారణాలు

జీవనశైలి వ్యాధుల్లో ఫ్యాటీ లివర్ ఒకటి, దీనిని నిపుణులు 'సైలెంట్ డిసీజ్' అని పిలుస్తున్నారు. ప్రారంభ దశలో లక్షణాలు కనిపించవు. కాలేయంలో 5-10% కంటే ఎక్కువ కొవ్వు పేరుకుంటేనే అసౌకర్యం కలుగుతుంది. కాలేయంలో నొప్పి నరాలు లేకపోవడం వల్ల లక్షణాలు ఆలస్యంగా కనిపిస్తాయి. జర్నల్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ ప్రకారం, ఆహారపు అలవాట్లు, ఇన్సులిన్ నిరోధకత ఫ్యాటీ లివర్‌కు ప్రధాన కారణాలు. శరీరం ఇన్సులిన్‌ను సరిగ్గా ఉపయోగించనప్పుడు, అదనపు చక్కెర కాలేయంలో కొవ్వుగా పేరుకుపోతుంది. ఫ్యాటీ లివర్ కడుపులో కొన్ని లక్షణాలను చూపుతుంది, వాటిని అర్థం చేసుకుంటే సమస్యను నియంత్రించవచ్చు.

# మళ్లీ సంక్రాంతి సందడికి రెడీగా ఉండండి



సంక్రాంతి పోటీలో కొంచెం ఆలస్యంగా థియేటర్లలోకి వచ్చినప్పటికీ, ప్రేక్షకుల నుంచి వచ్చిన బలమైన స్పందనతో 'నారీ నారీ నడుమ మురారి' సినిమా బాక్సాఫీస్ వద్ద సత్తా చాటుతోంది. కుటుంబ ప్రేక్షకులను ప్రధానంగా ఆకట్టుకునే హాస్యం, వినోదాత్మక కథనంతో రూపొందిన ఈ చిత్రం, మౌత్ టాక్ తో రోజురోజుకీ థియేటర్ల సంఖ్య పెంచుకుంటూ "సంక్రాంతి సక్సెస్ స్టోరీ"గా మారింది. ఇక ఈ విజయాన్ని సెలబ్రేట్ చేసుకుంటూ శుక్రవారం హైదరాబాద్‌లో చిత్రబృందం ఘనంగా సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ వేడుకలో హీరో శర్వానంద్ మాట్లాడుతూ, ఈ సినిమా తన కెరీర్‌లో ప్రత్యేకమైన అనుభూతిని ఇచ్చిందని చెప్పారు. "ఈ కథ వినగానే ఇది కచ్చితంగా ప్రేక్షకులను నవ్విస్తుందని, హిట్ అవుతుందని నమ్మకం కలిగింది. విడుదల తేదీ ఏదైనా సరే, మంచి కంటెంట్ ఉంటే ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకం ఈ సినిమాతో మరింత బలపడింది. చాలా కాలంగా ఎదురుచూస్తున్న పెద్ద విజయాన్ని ఈ సినిమా అందించింది" అని ఆనందం వ్యక్తం చేశారు. దర్శకుడు రామ్ అబ్బరాజు కథను చెప్పిన తీరు, తెరపై చూపించిన విధానం తనను బాగా ఆకట్టుకుందని, ఇండస్ట్రీకి ఇలాంటి కొత్త ఆలోచనలు ఉన్న దర్శకులు అవసరమని ఆయన ప్రశంసించారు. ఈ సినిమాలో నరేశ్ పోషించిన తండ్రి పాత్రకు ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందనను కూడా శర్వానంద్ ప్రస్తావించారు. "నరేశ్ గారి క్యారెక్టర్ థియేటర్లలో మరో హీరోలా ఎలివేట్ అయింది. ప్రేక్షకులు ఆ పాత్రకు ఇచ్చే రెస్పాన్స్ చూసి చాలా సంతోషంగా ఉంది" అన్నారు. అలాగే సంక్రాంతి సీజన్ తనకు కలిసి వస్తుందని సరదాగా వ్యాఖ్యానిస్తూ, ఇకపై ప్రతి సంక్రాంతికి తన కోసం ఒక సినిమా స్లాట్ రిజర్వ్ చేసుకోవాలని నవ్వుతూ చెప్పారు. వచ్చే సంక్రాంతికి దర్శకుడు శ్రీను వైట్ల దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న తన కొత్త చిత్రం విడుదల అవుతుందని కూడా వెల్లడించారు.

### సికింద్రాబాద్ కోసం
## మా పోరాటం ఆగదు




మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు


సికింద్రాబాద్ అస్తిత్వం కాపాడుకునేందుకు చేపట్టిన శాంతియుత ర్యాలీపై కాంగ్రెస్ సర్కార్ ఉక్కుపాదం మోపడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యమే మా ఏడో గ్యారంటీ అని చెప్పిన రేంత్ రెడ్డి .. నేడు ప్రశ్నించే గొంతుకలను పోలీసులతో అణచివేస్తూ నిరంకుశత్వమే మా పాలసీ అని నిరూపిస్తున్నారని విమర్శించారు. సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సాధన కోసం మా పార్టీ సీనియర్ నాయకులు తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో జరుగుతున్న శాంతియుత ర్యాలీని అడ్డుకోవడం, కార్యకర్తలను అరెస్టు చేయడం హేయమైన చర్య అని విమర్శించారు. ఈ అరెస్టులను తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడతామని చెప్పి.. అధికారంలోకి వచ్చాక రాష్ట్రాన్ని పోలీస్ రాజ్యంగా మార్చడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. గాంధేయ మార్గంలో శాంతియుతంగా చేస్తున్న ర్యాలీని అడ్డుకోవద్దని, అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు.. మీ నిర్బంధాలకు భయపడేది లేదని స్పష్టం చేశారు. చారిత్రక సికింద్రాబాద్ అస్తిత్వం కోసం మా పోరాటం ఆగదని అన్నారు.

## నాగబంధ రహస్యాలను అన్వేషిస్తూ..




నిర్మాత అభిషేక్ నామా స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న మైథలాజికల్ యాక్షన్ డ్రామా 'నాగబంధం'. విరాట్‌కర్ణ కథానాయకుడు. ఈ చిత్ర నిర్మాణం తుదిదశకు చేరుకున్నది. ఈ సందర్భంగా ఇందులో కథానాయికగా నటిస్తున్న నభా నటేష్ పాత్రను పరిచయం చేస్తూ, ఈ సినిమాకు చెందిన ఆమె ఫస్ట్‌లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇందులో ఆమె పాత్ర పేరు పార్వతి. ఇక పోస్టర్‌ని గమనిస్తే.. హుందాతనం, పవిత్రత, ఆధ్యాత్మికత మేళవింపుగా ఆమె లుక్ ఉన్నది. దేవాలయం నేపథ్యంలో పక్షులతో ఆడుకుంటూ ఈ పోస్టర్‌లో ఆమె కనిపిస్తున్నది. చుట్టూ రంగురంగుల పూలు, పచ్చని చెట్లు, నెమళ్లు.. ఇలా ఆహ్లాదకరమైన వాతావరణం ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నది. దేశంలోని పురాతన విష్ణు దేవాలయాల నేపథ్యంతో ఈ సినిమా కథ నడుస్తుందని, నాగబంధ సంప్రదాయ రహస్యాలను అన్వేషిస్తూ సాగే కథ ఇదని, డివోషనల్ బ్యాక్‌డ్రాప్‌తో సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఈ సినిమా ఉంటుందని మేకర్స్ తెలిపారు. మురళీశర్మ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సౌందర్‌రాజన్ ఎస్.

## బీజాపూర్‌లో 52 మంది మావోయిస్టుల లొంగుబాటు




మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో 52 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వారిలో డివిజన్ కమిటీ సభ్యుడితో సహా 21 మంది మహిళలు, 31 మంది పురుషులు ఉన్నారు. వీరంతా సీఆర్పీఎఫ్ డీఐజీ దేవేంద్రసింగ్ నేగీ, బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్ ఎదుట గురువారం నాడు లొంగిపోయారు. లొంగిపోయిన మావోయిస్టులపై రూ.1.45 కోట్ల మేర రివార్డులు ఉన్నట్లుగా ఎస్పీ జితేంద్ర యాదవ్ తెలిపారు. వీరికి తక్షణసాయం కింద ఒక్కొక్కరికీ రూ.50 వేల చొప్పున చెక్కులను పంపిణీ చేశారు.




## మంగళగిరిలో క్రికెట్ ఆడి సందడి చేసిన మంత్రి నారా లోకేశ్

మంగళగిరి బైపాస్ రోడ్డులోని భోగి ఎస్టేట్స్‌లో సంక్రాంతి సందర్భంగా జరుగుతున్న మంగళగిరి ప్రీమియర్ లీగ్ (ఎంపీఎల్) సీజన్ - 4 క్రికెట్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ హాజరై క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఎంపీఎల్ - 4లో భాగంగా 27వ రోజు, మూడో రౌండ్ చివరి మ్యాచ్‌గా వల్లభనేని వెంకట్రావ్ యూత్, విక్కీ 11 జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌కు మంత్రి లోకేశ్ టాస్ వేశారు.

## శ్రీ లీలా హాట్ లుక్స్



టాలీవుడ్ క్రేజీ హీరోయిన్ మరోసారి అందాల జాతర చేసి స్పెషల్ గా అట్రాక్ట్ చేసింది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫొటోస్ వైరల్ అవుతున్నాయి.రాఘవేంద్రరావు దర్శకత్వ పర్యవేక్షణలో వచ్చిన పెళ్లి సందD సినిమాతో హీరోయిన్‌గా పరిచమైన శ్రీలీల.. క్రమంగా టాలీవుడ్ క్రేజీ హీరోయిన్ అయిపోయింది. తొలి సినిమాతోనే కుర్రకారు మనసు దోచేసి తెలుగులో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ గా మారిపోయింది ఈ కన్నడ సోయగం.తొలి సినిమాతోనే మంచి హిట్ అందుకున్న ఈ భామ డేట్స్ కోసం దర్శక నిర్మాతలు క్యూ కట్టే పరిస్థితి నెలకొంది. చూస్తుండగానే శ్రీలీల రేంజ్ ఎక్కడికో వెళ్ళిపోయింది. ఒక్కసారిగా టాలీవుడ్ లో శ్రీలీల ట్రెండ్ మొదలైంది. తన అందచలతో కుర్రాళ్ళ హృదయాలు కొల్లగొట్టి.. నాలుగు రాళ్లు వెనకేసుకుంది శ్రీలీల. రెండో సినిమాలో రవితేజకు జంటగా నటించి సక్సెస్ అందుకుంది. రవితేజ- శ్రీలీల జంటగా వచ్చిన ధమాకా మూవీ మంచి విజయం సాధించింది.ఇదే అదునుగా తన పాపులారిటీ మరింత పెంచుకునేలా సోషల్ మీడియాలో అందాల రచ్చ చేస్తోంది.